సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 21 । నవంబర్ । 2023



నేత్రపర్వంగా గంగాహారతి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆధ్వర్యంలో గంగాహారతి నేత్రపర్వంగా నిర్వహించారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటరు అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

మంథని: నియోజకవర్గ కేంద్రంలో సోమవారం అధికారులు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైనది ఓటుహక్కు అని జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లతోపాటు మున్సిపల్ కమిషనర్ సతీశ్, తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ నోడల్ అధికారి రవీందర్, డెప్యూటీ తహసీల్దార్ గిరిప్రసాద్, ఎంపీడీవో రమేశ్, ఎస్సైలు కిరణ్‌కుమార్, రాణివర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చంద్రవైన్స్‌లో రికార్డులు సరిగా రాయని కారణంగా రూ.15వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. అలాగే, ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన కుమారస్వామి అక్రమంగా బైక్‌పై మద్యం రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మద్యం దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రైలు పట్టాలు తనిఖీ



పట్టాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్య ప్రమాదాల నివారణ కోసం రైల్వేశాఖ రైలు పట్టాల తనిఖీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారంరోజులుగా పెరుగుతున్న చలి తీవ్రతకు రైలు పట్టాలు సంకోచ, వ్యాకోచాలు చెంది ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వీటి నియంత్రణకు ప్రత్యేకంగా రైలు ఇంజిన్ పర్యవేక్షణ చేస్తోంది. ఓదెల, పొత్కపల్లి, రామగుండం, మంచిర్యాల, కొలనూర్, రాఘవాపూర్, పెద్దపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలుపట్టాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతీవేసవి, చలికాలంలో సంకోచ, వ్యాకోచాలు జరిగి భౌతిక మార్పులు చోటుచేసుకుంటాయని, తద్వారా రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే ముందస్తుగా రైలుపట్టాలను పరిశీలిస్తున్నట్లు రైల్వేసిబ్బంది తెలిపారు.

పత్తి ధర రూ.6,816



పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి క్వింటాలు గరిష్టంగా రూ.6,816 ధర పలికింది. కనిష్టంగా రూ.5,911 సగటు రూ.6,711 ధర పలికిందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్ తెలిపారు. 905క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అభిమానం చాటుకున్న గులాబీ బాస్



విజయ సంకేతం చూపుతున్న సీఎం కేసీఆర్

- మరో రెండు కొత్త హామీలు
- ఆటోలకు ఫిట్‌నెస్ పన్ను రద్దు
- ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడతాం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేదికగా ప్రకటించిన సీఎం కేసీఆర్



తిమ్మాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మానకొండూరు/తిమ్మాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాపై సీఎం కేసీఆర్ తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. జిల్లా వేదికగా రైతుబంధు, రైతుబీమా, దళితబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలు ప్రకటించిన గులాబీ అధినేత ఈసారి రెండు కీలక హామీలు ఇచ్చారు. 'మా కరీంనగర్ భీముడు మంత్రి గంగుల కమలాకర్ చెప్పినట్లుగా నాకూ, కరీంనగర్‌కు ప్రత్యేక బంధం ఉంది' అన్నారు. తాను ఇక్కడి పిల్లను చేసుకున్నానని గుర్తుచేశారు. రెండు హామీల్లో మొదటిది ఆటో ఫిట్‌నెస్ పరీక్షలు రూ.700, సర్టిఫికెట్ కోసం రూ.500 మొత్తం రూ.1200 కట్టాల్సిన పని లేదన్నారు. రెండోది రాష్ట్రంలో భారీగా ఉత్పత్తి అవుతున్న ధాన్యం కోసం ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడతామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో హుజూరాబాద్ వేదికగా రైతుబంధు, 2021 హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో దళితబంధు పథకాలను ప్రకటించిన విషయం విదితమే.

ఏ రోడ్డు చూసినా వరికుప్పలే..

ప్రత్యేక రాష్ట్రం రాకముందు తెలంగాణలో జొన్నలు తప్ప మరేమీ పండవని ఎగతాళి చేశారని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. కానీ, ఈరోజు మానకొండూర్‌లో అన్నపూర్ణ, లోయర్ మానేరు, మిడ్‌మానేరు, తోటపల్లి నాలుగు ప్రాజెక్టులతో పచ్చగా మారిందన్నారు. వరి దిగుబడిలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచామన్నారు. ఫలితంగా ఏ రోడ్డు చూసినా వరికుప్పలే దర్శనమిస్తున్నాయని తెలిపారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దళితులను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. మానకొండూరులో ఉన్న దళితులందరికీ దళిత బంధు పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల నుంచి ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు, ధరణి తీసేస్తే రోడ్లు ఎక్కి ధర్నాలు చేయాల్సి వస్తుందని సభా వేదికగా సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.



వేదికపై కళాకారుల ఆటాపాటా

తరలివచ్చిన ప్రజలు

మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ శ్రీచైతన్య కాలేజీ మైదానంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఇల్లంతకుంట, మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సభ పూర్తయ్యాక హైదరాబాద్ రోడ్డుపై చాలాచోట్ల ట్రాఫిక్‌జామ్ అయ్యింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నేతలను అడ్డుకున్న పోలీసులు

సీఎం కేసీఆర్ తన ప్రసంగం ముగించాక ప్రజలకు అభివాదం చేస్తూ వేదిక దిగుతున్న క్రమంలో పోలీసులు పలువురు బీఆర్‌ఎస్ నేతలను అడ్డుకున్నారు. ఆయన వెళ్లేంత వరకు మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు చాలా మందిని నిలువరించారు. వేదిక పరిసరాల్లో స్థానిక పోలీసులు లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ఇంతలో దూరంగా ఉన్న కొందరు పోలీసు ఉన్నతాధికారులు వచ్చి, మంత్రికి సర్దిచెప్పారు. రేణిగుంట టోల్‌గేట్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచార రథాన్ని పోలీసులు తనిఖీ చేశారు.

మంథనిలో కాంగ్రెస్ ఒంటరి పోరాటం

- ప్రచారంలో వెనుకబడిన శ్రీధర్‌బాబు



పుట్ట మధు



శ్రీధర్‌బాబు

సాక్షి, పెద్దపల్లి: మంథని అసెంబ్లీకి ప్రధాన పార్టీల తరఫున నలుగురు అభ్యర్థులు పోటీపడుతున్నా.. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ నెలకొంది. పోలింగ్ గడువు సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత సభల సక్సెస్‌తో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పల్లె, పట్టణాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం హోరెత్తిస్తుండటంతో కారు పార్టీలో జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ తరఫున రాహుల్‌గాంధీ పర్యటనతో హస్తం పార్టీలో జోష్ నెలకొన్నా.. ఆ తర్వాత మరే ఇతర అగ్రనేతలు ప్రచారానికి రాకపోవడం, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఒంటరిగా ప్రచారం చేస్తుండడంతో వెనకబడినట్లు కనిపిస్తోంది. రాహుల్ పర్యటనతో కాంగ్రెస్‌లో ఊపు వచ్చినా, ఆ సభ తర్వాత కేసీఆర్, కవిత సభలు నిర్వహించి సక్సెస్ చేయడంతోపాటు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, కాంగ్రెస్ హయాంలో జరగని అభివృద్ధిని తొమ్మిదేళ్లలోనే చేశామంటూ చేసిన విమర్శలకు సరైన కౌంటర్ కాంగ్రెస్ నుంచి లేకపోవడంతో సొంత క్యాడర్‌లో అయోమయం నెలకొంది.

బలపడుతున్న బహుజనవాదం

మంథనిలో ఇటీవల పర్యటించిన సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. బీసీ బిడ్డను గెలిపించుకోవాలని, పుట్ట మధు గెలుపు కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ఉద్యోగులు, యువకులు కలిసి పనిచేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు సైతం బహుజన వాదంతో బీసీ బిడ్డను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తుండగా, సీఎం కేసీఆర్ వ్యాఖ్యలతో బీసీ వాదానికి బలాన్ని ఇచ్చినట్లయింది. పుట్ట మధును గెలిపిస్తే రూ.1,000కోట్లతో అభివృద్ధి చేస్తానని ప్రకటించటం చర్చనీయాంశంగా మారింది. అలాగే ఎమ్మెల్సీ కవిత పర్యటన సందర్భంగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబు హయాంలో చేసిన అభివృద్ధి, ఒకసారి ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా పుట్ట మధు చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సింగరేణిని అప్పులపాలు చేసి, 49శాతం వాటాను కేంద్రానికి కట్టబెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శలు గుప్పించారు. కొన్నిరోజులుగా బీఆర్‌ఎస్ విమర్శలకు కాంగ్రెస్ నుంచి ధీటైన స్పందన కరువైందని ఆ పార్టీ శ్రేణులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకేకుటుంబానికి ఏడుసార్లు అవకాశం కల్పించిన మంథనిలో ఆశించినమేర అభివృద్ధి సాధించలేదనే విమర్శలు వినిపిస్తున్న వేళ.. నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటారో, మరోసారి శ్రీధర్‌బాబుకు అవకాశం కల్పిస్తారో డిసెంబర్ 3న తేలనుంది.

23లోగా ఓటరు స్లిప్పులు అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ఈనెల 23లోగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. స్థానిక తిలక్‌నగర్‌లో బూత్‌స్థాయి అధికారులు ఓటరు స్లిప్పుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి సోమవారం పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఇంటినుంచి ఓటు..

ఇంటినుంచి ఓటు వేసే ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇంటి నుంచి నిర్వహించే పోలింగ్ ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పించారు. రిటర్నింగ్ అధికారి మధుమోహన్, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఉన్నారు.

బ్యాలెట్ యూనిట్‌ల పరిశీలన

జిల్లాకు చేరిన 624 అదనపు బ్యాలెట్ యూనిట్ల తొలిదశ పరిశీలన ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. పెద్దపల్లిలోని ఈవీఎం గోదాంను అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌తో కలిసి పరిశీలించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా

- సాక్షి'తో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సాక్షి, పెద్దపల్లి: ప్రజల బాగుకోసం అభివృద్ధికి పాటుపడే వారు కావాలా? కొట్లాలు, పచ్చని పల్లెల్లో వైషమ్యాలు రగిలించే వ్యక్తులు కావాలో విజ్ఞులైన ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. తొమ్మిదిన్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపానని అన్నారు. ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా ఉన్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు..

సాక్షి: ప్రచారం ఎలా సాగుతోంది?

దాసరి: ప్రచారం బ్రహ్మాండంగా సాగుతోంది. అన్నివర్గాల నుంచి స్పందన బాగుంది. తొమ్మిదిన్నరేళ్ల క్రితం నియోజకవర్గం ఎట్లా ఉండే.. నేడు ఎట్లా ఉందో ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నాం. సర్ మీరు గెలవాలి.. మీరు గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. వేలాదిమంది పేద విద్యార్థులకు చదువుకోవడానికి, చాలామంది నిరుపేదలకు ఆర్థికంగా సాయం చేశా. కానీ, నేనెప్పుడూ ప్రచారం చేసుకోలేదు. సాయం పొందినవారు నేను పిలవకున్నా వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇది ఆనందంగా ఉంది.

సాక్షి: మీరు చేసిన అభివృద్ధి ఏంటి?

దాసరి: పెద్దపల్లిని జిల్లాగా ఏర్పాటు చేసుకుని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం. తాగు, సాగునీటి కష్టాలు తీర్చి చివరి ఆయకట్టుకు నీళ్లు అందించాం. రూ.వందల కోట్లతో జిల్లా, మండల, గ్రామాలకు రోడ్లు నిర్మించి రవాణా వ్యవస్థను మెరుగుపర్చాం. జిల్లాకేంద్రంలో మాతా శిశుసంరక్షణ కేంద్రం, దశాబ్దాల ఆకాంక్ష కునారం రోడ్డు రైల్వే బ్రిడ్జికి శంకుస్థాపన చేయటంతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎల్లమ్మచెరువుపై మినీట్యాంక్ బండ్, ఓపెన్ జిమ్‌లతో ప్రజలకు ఆహ్లాదం అందిస్తున్నాం. పల్లెల్లో స్వచ్ఛత, పరిశుభ్రతల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశంలోనే అవార్డులు సాధించాం.

సాక్షి: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీరు చేసే అభివృద్ధి ప్రణాళిక ఏంటి?

దాసరి: అభివృద్ధిని కొనసాగిస్తూ మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ముఖ్యంగా నియోజకవర్గంలో చదువుకున్న వారి కోసం ఫుడ్ ఇండస్ట్రీస్, ఐటీ సెంటర్, స్కిల్‌డెవలంప్‌మెంట్ సెంటర్ నెలకొల్పాల్సిన అవసరం ఉంది. దీంతో వారు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలు పెంచేలా, ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రతీ మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తాం.

సాక్షి: ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలపై మీ సమాధానం ఏంటి?

దాసరి: రాష్ట్రాన్ని 70ఏళ్లు పాలించిన పార్టీలు నియోజకవర్గానికి ఏంచేశాయి. తొమ్మిదేళ్లల్లో మేం చేసిన అభివృద్ధి కళ్లముందు కనిపిస్తుంది. పెద్దపల్లిని జిల్లాగా ఏర్పాటు చేసి అన్నిరంగాల్లో శరవేగంగా అభివృద్ధి చేశాం. మమ్మల్ని విమర్శించడానికి ఏ కారణాలు దొరకడం లేదు. ఏవిధంగానైనా బురదజల్లాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. వారి ఆరోపణల్లో పసలేదు.

సాక్షి: మీకు ఏఏవర్గాల మద్దతు ఎలా ఉంది? వారిని మెప్పించేందుకు ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయి?

దాసరి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ. పార్టీ ఎమ్మెల్యేగా అన్ని సామాజికవర్గాల అభ్యున్నతికి కృషి చేశా. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా సబ్బండ వర్గాలు ఆత్మగౌరవంతో బతుకుతున్నాయి. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసు. అందుకే అన్నివర్గాలు నన్ను ఆదరిస్తున్నాయి. అక్కున చేర్చుకుంటున్నాయి. ఈసారి అన్ని వర్గాల ప్రజలందరూ మావైపే ఉంటారన్న నమ్మకం ఉంది.

సాక్షి: ఓటర్లకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

దాసరి: ఎమ్మెల్యేగా నేను గెలుపొందినప్పటి నుంచి ఎక్కడా గొడవలు, కొట్లాటలు లేవు. శాంతిభద్రతలకు పెద్దపీట వేయటంతో గ్రామాలన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. తప్పుడు హామీలు, వ్యక్తులు, పార్టీల మధ్య వైషమ్యాలతో అధికారంలోకి రావాలనుకుంటు వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అభివృద్ధి నినాదంగా పనిచేసే వారు కావాలో? అరాచాకం చేసేవారు కావాలో ప్రజలు ఆలోచించి, అభివృద్ధిని కొనసాగించే పార్టీకి ఓటు వేయాలని నియోజకవర్గ ఓటర్లను కోరుకుంటున్నా.

నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేయండి

- రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ



అరుణశ్రీ

గోదావరిఖని: ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ సోమవారం సూచించారు. పోలింగ్ గడువు సమీపిస్తున్న క్రమంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు, ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, డబ్బు పంపిణీ, అసత్య ప్రచారం, ఉచితాల పంపిణీ, మత్తు పదార్థాల రవాణా, అనుమతి లేకుండా అంటించిన పోస్టర్లు, బ్యానర్లు తదితర అంశాలపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా ఓటర్ స్లిప్పుల పంపిణీపై ఫిర్యాదులు, సందేహాలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ –18004256521, 1950, సీ–విజిల్ యాప్ అందుబాటులో ఉన్నాయన్నారు.

వెబ్‌పోర్టల్

ఎన్‌జీఆర్‌ఎస్.www.eci.gov.in లో ఫిర్యాదు చేయాలని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈసేవలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా

ఆచార్య అంటే..

- మంథనికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డిని టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) 'ఆచార్య గురూజీ' అని పిలిచేవారు.
- 1972 ఎన్నికల్లో మంథని అసెంబ్లీ స్థానం నుంచి పీవీ నరసింహారావు, ఈవీ పద్మనాభం పోటీచేశారు. పీవీ మంథనిలో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదు. పద్మనాభం ఓ చావడి వద్ద మీటింగ్ పెట్టారు. అప్పటి ఎన్నికల్లో పీవీనే శాసనసభ్యుడిగా విజయం సాధించారు.

– మంథని

పనికిరాని పరికరాలు

- అనువుగా లేనిమైదానాలు
- చెరువు కట్టలు, రహదారులే దిక్కు
- సమస్య పరిష్కరించాలంటున్న వాకర్లు

సాక్షి పీపుల్స్ ఎజెండా



పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు

పెద్దపల్లిరూరల్: ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రోజూ వాకింగ్ చేయాలని వైద్యులు చెబుతున్నారు. వ్యాయామం తప్పనిసరి అంటున్నారు. వయోభేదం లేకుండా అన్నివయసుల వారూ నిత్యం వేకువజామున ఈ ప్రక్రి య ప్రారంభించాల్సిందే. అయితే వాకింగ్, వ్యాయామం చేసేందకు అవసరమైన మైదానాలు, పరి కరాలు లేవు. ప్రభుత్వ వి ద్యా సంస్థల్లోని మైదానాలు, చెరువు కట్టలు, రోడ్లే దిక్కవుతున్నాయి.

పెద్దపల్లిలో...

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఐటీఐ మైదానాల్లో వాకింగ్ చేసేందుకు పట్టణంలోని పలువార్డులకు చెందిన ప్రజలు వేకువజామునే వస్తుంటారు. ఇవికాకుండా ఎల్లమ్మ, గుండమ్మ చెరువుకట్టలపై కూడా వాకింగ్ చేస్తున్నారు. ఇక్కడే కాకుండా పెద్దపల్లిలోని చీకురాయి రోడ్డు, కూనారం రోడ్డు, గౌరెడ్డిపేట రోడ్డు వైపు కూడా నడుచుకుంటూ వెళ్లేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఓపెన్ జిమ్‌లతో సమస్యలు..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంతోపాటు ఎల్లమ్మ, గుండమ్మ చెరువుకట్టపై ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో చాలావరకు పరికరాలు పనికిరావడంలేదని వాకర్లు ఆరోపిస్తున్నారు. మైదానాల్లో వాకింగ్ చేసిన వారంతా జిమ్ చేసేందుకు వస్తే ఆయా పరికరాలు పనికి రావడం లేదని పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

రాజీవ్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొంతకాలం క్రితం మట్టితో వేసిన ట్రాక్‌పై నడిచేందుకు వచ్చే వాకర్లకు అనువుగా ఉండేలా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన లైట్లు వెలగడం లేదు. ఫలితంగా వేకువజామున వచ్చే మహిళావాకరునానాఇబ్బందులుపడుతున్నారు. రాత్రి సమయాల్లో మద్యం తాగడంతోపాటు అసాంఘిక కార్యకాలపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.



ఆకతాయిలు ధ్వంసం చేసిన విద్యుత్‌లైట్

కనీస వసతులు కల్పించాలి

వేకువజామున వాకింగ్ చేసేవారికి మైదానాల్లో భయం కలుగకుండా మున్సిపల్ పాలకులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వాకర్లు కోరుతున్నారు. మైదానంలో చీకటి ఆవరించకుండా లైట్లను ఏర్పాటు చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలంటున్నారు. రోడ్లపై నడుస్తూ తరచూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైట్లు వెలిగించాలి



ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన లైట్లు వెలుగకుండా గుర్తుతెలియని వ్యక్తులు తీగలు కట్ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారే ఈ చర్యలకు పాల్పడి ఉంటారు. పోలీసులు నిఘా పెంచాలి.

– రంగు శ్రీనివాస్, పెద్దపల్లి

శుభ్రం చేయాలి



ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానానికి వాకర్లు కాలినడకన నడిచేందుకు ఎక్కువగా వస్తుంటారు. మైదానంలో క్రషర్‌కు సంబంధించిన రాళ్లను పోయడం ఇబ్బందికరంగా మారింది. వాకర్లకు ఇబ్బంది కలుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– దేవసాని ధర్మయ్య

వసతులు కల్పించాలి



ప్రభుత్వ కాలేజీ మైదానానికి వాకింగ్‌కు వచ్చేవారి కోసం ట్రాక్ పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. వాకర్లకు అవసరమైన రీతిన పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాలి. సమస్యలు పరిష్కరించాలి.

–పి.లక్ష్మీనారాయణ, పెద్దపల్లి

మైదానాల్లేవ్



ప్రస్తుతం చాలామంది బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారు. వారందరికీ వైద్యులు వ్యాయాయం చేయడం తప్పనిసరి అని చెబుతున్నారు. అందులో వాకింగ్, ఓపెన్ జిమ్‌కు వస్తున్నవారంతా ఏదో సమస్యతో బాధపడుతున్నారు. ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన అధికారులు.. వాటి నిర్వహణపై దృష్టి సారించాలి.

–బండి మల్లేశ్, పెద్దపల్లి

క్లుప్తంగా

అవార్డు అందుకున్న రాజానందం

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ కట్ట రాజానందం జాతీయ లిజెండర్ స్వర్ణనంది పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ జాతీయ విశ్వకర్మ సేవాట్రస్టు, గుంటూరు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందించారు. వీరబ్రహ్మేంద్రస్వామి పదో తరం మనుమడు గోవిందస్వామి, సినీ నటుడు సంపూర్ణేశ్‌బాబు ఆధ్వర్యంలో కట్ట రాజానందానికి స్వర్ణకిరీటం తొడిగి నంది అవార్డు అందించి సత్కరించారు. ట్రస్టు చైర్మన్ బాలబ్రహ్మాచారి, గౌరీశంకర్, డాక్టర్ చిత్రాల గురుమూర్తి, గాయని నందూరి సుబ్బమ్మ, సూరపల్లి విజయ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పాసుపుస్తకాలు రెడీ

గోదావరిఖని: తాము చేసిన ఆందోళన ఫలితంగా సీఎంపీఎఫ్ పాస్‌పుస్తకాలను కార్మికులకు అందించేందుకు సిద్ధమైయ్యాయని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు సోమవారం తెలిపారు. ఆర్జీ–1, 2, 3, ఏపీఏ, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 2018నుంచి పెండింగ్‌లో ఉన్న పాస్‌పుస్తకాలను సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ అరుణ్‌పచౌరి విడుదల చేశారన్నారు. ఈపుస్తకాలను అన్ని ఏరియాల్లోని కాంట్రాక్టు కార్మికులకు అందించాలని ఆయా ఏరియాల అధికారులకు సూచించారని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన సార్ల రాజేశం (55) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది సోమవార ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. రాజేశం చిన్నకుమారుడు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి తిరిగి వచ్చాడు. ఈక్రమంలో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితం విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు

గోదావరిఖని: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన ఓ వ్యక్తిని సోమవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ ఎదుట హాజరుపరుచగా ఈ శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

కళాశాల సందర్శన



మాట్లాడుతున్న కల్పన

మంథని: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి కల్పన సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు నమోదు, సిలబస్, ఇతర అంశాలపై చర్చించి, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు అందరూ కళాశాలకు హాజరు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకు రావాలని కోరారు. గైర్హాజరు అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని అధ్యాపకులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సలీమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న కాలువలు

- భరించలేకపోతున్న ప్రజలు
- పూడికతీతపై అధికారుల నిర్లక్ష్యం
- వ్యర్థాలతో నిండిన నాలాలు
- దుర్వాసనతో తల్లడిల్లుతున్న జనం



ఇది గోదావరిఖని శివాజీనగర్‌లోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ సమీప ప్రధాన డ్రైనేజీ. నెలలుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇవి చాలవన్నట్లు చేపలు, కోళ్లు, మాంసం, పండ్ల వ్యర్థాలను కొందరు వ్యాపారులు ఇందులోనే పడేస్తున్నారు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఫలితంగా దుర్వాసన వ్యాపిస్తోంది. ఈపదాది ప్రధాన నాలాల్లో పూడికతీతపై అధికారులు దృష్టి సారించలేదనేదానికి ఈ చిత్రమే నిదర్శనంగా నిలుస్తోంది.



మార్కండేయకాలనీ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు



ఎల్బీనగర్ నాలాలో పూడిక ఇలా..

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని ప్రధాన మురుగునీటి కాలువలు వ్యర్థాలతో నిండి కంపుకొడుతున్నాయి. దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ప్రజలపై దాడులు చేయడంతో వ్యాధుల బారినపడుతున్నారు. వాస్తవంగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ప్రతిపాదనలు పూర్తిచేసి మేలో పూడికతీయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకున్న నాథుడే లేడు.

పట్టింపులేదు..

- నగరంలో సుమారు 319.9 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలు విస్తరించి ఉన్నాయి.
- ప్రధాన నాలాల్లో వేసవి ఆరంభంలోనే యాక్షన్ ప్లాన్‌తోపాటు పూడికతీయాల్సి ఉంటుంది.
- అధికారులు ఆ పనులను సక్రమంగా పూర్తిచేయించలేదు.
- సకాలంలో టెండర్లు పిలిచి, యాక్షన్ ప్లాన్ చేపట్టి పనులు నిర్వహించాల్సిన ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో పిలవాల్సిన టెండర్లను మేలో రూ.40 లక్షల వ్యయంతో పిలిచారు.
- ఈ పనులను కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదని నగరవాసులు అంటున్నారు.

ఫిర్యాదు చేశాం



మార్కండేయకాలనీలోని ప్రధాన నాలాలో పూడికతీత తీయాలని అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేశాం. నాలాలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, చెత్త, మట్టి పేరుకుపోయాయి. దుర్వాసన భరించలేకపోతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇప్పటికైనా పూడికతీయాలి.

– చెరుకుపల్లి గీతారెడ్డి, మార్కండేయకాలనీ

నిండిన కాలువలు



శ్రీకృష్ణా టెంపుల్ పక్కనున్న ప్రధాన నాలా చెత్త, చెదారంతో నిండిపోయింది. కాలువల్లో మురుగునీరు నిలిచిపోతుండడంతో కంపువాసన వస్తోంది. ఇండ్లల్లోకి పాములు వస్తున్నాయి. కాలువలను క్రమం తప్పకుండా ఎందుకు శుభ్రం చేయడం లేదు. చర్యలు తీసుకోవాలి.

– దూదపాక శాంత, మార్కండేయ కాలనీ

పాలకవర్గంతో చర్చిస్తాం



నాలాల్లో పూడికతీత సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ఎన్నికల తర్వాత పాలకవర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇంజినీర్లతో కూడా సమీక్షిస్తాం. సమస్యలు పరిష్కరిస్తాం.

– నాగేశ్వర్, కమిషనర్, నగరపాక సంస్థ

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు



వాసవిని అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్ స్పోర్ట్స్: తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ యూనివర్సిటీ స్థాయి కబడ్డీ పోటీలకు కరీంనగర్‌లోని డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని డి.వాసవి, ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు పి.అనూష, వి.రమ్య, జి.సాయిప్రియలు రాణించారు. ఈ సందర్భంగా వారిని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీధర్‌రావు, శ్రీనాథ్‌రెడ్డి, వివేకానంద కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు సోమవారం అభినందించారు.

తనువు చాలించి.. నలుగురికి ప్రాణం పోసి..

- బ్రెయిన్ స్ట్రోక్‌తో 'సాక్షి' ఉద్యోగి మృతి
- జీలకుంటలో విషాదం



శ్రీనివాస్(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఆయన మరణించి మరో నలుగురికి ప్రాణం పోశారు. జీలకుంటకు చెందిన 'సాక్షి' ఉద్యోగి శ్రీపతి శ్రీనివాస‌గౌడ్(48) బ్రెయియిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు అవయవదానం చేసి నలుగురికి ప్రాణం పోశారు. హైదరాబాద్ షేర్‌లింగంపల్లిలో 16ఏళ్లుగా సాక్షి దినపత్రికలో అడ్వర్టయిజ్ మెంట్ విభాగంలో సీనియర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ రావటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరురోజులుగా చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాసవిడిచారు. శ్రీనివాస్ అవయవదానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. దీంతో కిమ్స్ ఆస్పత్రిలో గుండె, లివర్, కిడ్నీలను వారు దానం చేశారు. శ్రీనివాస్ మృతదేహాన్ని మియాపూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు. 'సాక్షి' డైరెక్టర్ కేఆర్‌పీరెడ్డి, షేర్‌లింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్‌యాదవ్, విజేత సూపర్ మార్కెట్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, 'సాక్షి' ఏడీవీటీ సీనియర్ మేనేజర్ వెంకటేశ్, షేర్‌లింగంపల్లి ఆర్‌సీ ఇన్‌చార్జి మాధవరెడ్డి, 'సాక్షి' ఉద్యోగులు శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

జీలకుంటలో అంత్యక్రియలు

శ్రీపతి శ్రీనివాస్ అంత్యక్రియలు ఆయన జీలకుంటలో జరిగాయి. ఆస్ట్రేలియాలో ఉన్న కుమారుడు టింకు వెంటనే స్వగ్రామానికి చేరుకున్నారు. శ్రీనివాస్ చితికి కుమారుడు టింకు నిప్పంటించారు. మృతుడికి భార్య మాధవి, కుమారుడు టింకు, కూతురు దీప్తి ఉన్నారు. సర్పంచ్ పత్తి మాలతి–సమ్మిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, దినపత్రిక ఆర్‌ఎం దండు జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నల్ల రమణారెడ్డి, చర్లపల్లి సురేశ్ తదితరులు హాజరయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

- యువకుని ఆత్మహత్య
- సూసైడ్‌నోట్ రాసి ఉరివేసుకున్న యువకుడు
- ఎన్గల్‌లో విషాదం



ప్రమోద్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చందుర్తి(వేములవాడ): చేతిలో డబ్బు లేకపోవడం.. చెల్లికి పెళ్లి చేయలేకపోవడంతో మనస్థానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం ఎన్గల్‌లో విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని ఎన్గల్‌కు చెందిన గసికంటి ప్రమోద్(25) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ కంపెనీలో పని సరిగ్గా లేక రెండేళ్ల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గ్రామంలోనే కూలీ పనిచేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలో పత్తి లోడు(హమాలీ) పనిచేసి ఇంటికొచ్చాడు. తల్లి సత్తవ్వతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. తెల్లవారుజామున తల్లి లేచి చూసే సరికి ప్రమోద్ ఇంట్లో దూలానికి ఉరివేసుకుని కనిపించాడు. తల్లి రోదనలతో చుట్టుపక్కల వారు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెంది కనిపించాడు. తన చావుకు ఎవరు కారణం కాదని.. ఆర్థిక ఇబ్బందులతోనే చనిపోతున్నట్లు సూసైడ్‌నోట్‌లో రాశాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. మృతునికి తల్లి సత్తవ్వ, తండ్రి శంకర్, చెల్లె శ్రావణి ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

అప్పుల బాధతో రైతు..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలంలోని భూక్య తండాకు చెందిన రైతు భూక్య శంకర్(48) అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. శంకర్ కొడుకు లింగమూర్తి అనారోగ్యంతో బాధపడుతుంటే చికిత్స కోసం దాదాపు రూ.10లక్షల వరకు అప్పుచేసి ఖర్చు పెట్టాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్థాపంతో తన పంట చేనులోకి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య రేణ, పెళ్లయిన కుమార్తె సరోజ, కుమారుడు లింగమూర్తి ఉన్నారు.

డంపింగ్‌యార్డు ఎత్తివేయాలి



సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాంతంలో నిరసన తెలుపుతున్న నాయకులు

- యూత్ కాంగ్రెస్ నేతల డిమాండ్
- సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద నిరసన

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని గోదావరి తీరంలో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంతంలో మున్సిపల్ డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జాతర ప్రాంతాన్ని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నజీమీద్దీన్, అధికార ప్రతినిధి సుధామల అరుణ్‌సాయి ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. జారత నిర్వహించే ప్రాంతంతోపాటు గోదావరినదిలోకి చెత్త చేరుతోందని అన్నారు. వేలాది టన్నుల చెత్తను పోయడంతో అది కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోందన్నారు. దీనికి తోడు చెత్తను కాల్చివేస్తుండడంతో సమీప కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వతంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని, దుర్వాసన రాకుండా జాతర ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు చేపట్టకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాత కళాశాల భవనంలో చోరీ

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పాత భవనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సీఐ రమేశ్ తెలిపిన వివారాల ప్రకారం.. కళాశాల పాత భవనం కొన్నేళ్లుగా వినియోగంలో లేదు. అందులోని స్టీల్ అల్మారాలు, 3 ల్యాప్‌టాప్ టేబుళ్లు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్, బెంచీలు, సైన్స్ ల్యాబ్ పరికరాలతోపాటు ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ నెల 17న ప్రిన్సిపాల్ రాజశేఖర్ కళాశాలను సందర్శించిన సమయంలో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.93 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై సోమవారం ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వల్లేనని ఆరోపణ

కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని, కళాశాల పాత భవనంపై పర్యవేక్షణ కరువైందని పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. చోరీ సంఘటననూ దాచిపెట్టాలని చూశారన్నారు. తాము నిలదీయడం వల్లే విషయం బయటకు వచ్చిందని, ఫర్నిచర్‌ను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకలు ఎనాగరాజు, శివ, కళాశాల విద్యార్థులున్నారు.

రైతు బలవన్మరణం

గొల్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గుడ్ల చంద్రయ్య(50) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రయ్య రెండేళ్లుగా మానసిక సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ నెల 17వ తేదీన తన భార్యతో గొడవ పడి, ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తన పొలానికి సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు ఉరితాడుకు వేలాడుతున్న చంద్రయ్య మృతదేహాన్ని గుర్తించారు. మానసిక సమస్యల కారణంగానే తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి పెద్ద కుమారుడు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

వసూళ్లతో మాకు సంబంధం లేదు

- రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలో ఉద్యోగాల పేరిట చేస్తున్న వసూళ్లకు తమ యూనియన్‌తో ఎలాంటి సంబంధంలేదని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ సోమవారం తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను నియమిస్తూ వారి నుంచి యూనియన్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని మావోయిస్టు డివిజన్ కమిటీ ఆరోపించడం సరికాదన్నారు. 35ఏళ్లుగా కార్మికుల హక్కుల సాధనకు స్వతంత్ర, ఐక్య కార్యాచరణతో ఉద్యమాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులకు నష్టం జరిగేలా అగ్రిమెంట్లు చేసుకోవడం లేదని, ఒప్పందాలప సంతకాలు చేయడం లేదని, కార్మికుల పక్షాన నిలిచిన చరిత్ర సీఐటీయూకు ఉందని వివరించారు. తమ యూనియన్ ఎప్పుడూ కార్మికుల పక్షపాతిగానే ఉంటోందని, యాజమాన్యాలకు కొమ్ముకాయదని, దళారిపాత్ర పోషించదని, నిజాయితీగా కార్మికుల హక్కుల సాధనలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని వారు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



మద్యం చూపుతున్న పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న 6.3 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన అంబటి రమేశ్ సోమవారం జమ్మికుంట పట్టణానికి వచ్చి, బైక్‌పై మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమాదేవి, హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు విశ్వజ్ఞ, రేణుక, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు కరీంనగర్ వన్ టౌన్ ఎస్ఐ స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన లకావత్ ఈర్య కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యం దుకాణాల నుంచి కొంత మద్యం కొనుగోలు చేసి, ఇంట్లో నిల్వ ఉంచి, తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. పోలీసులు సోమవారం పక్కా సమాచారంతో వెళ్లి, అతను మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. రూ.1,240 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఈర్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానకొండూర్: అన్నారంలోని వైన్స్ నుంచి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన మహంకాళి మహేశ్ సోమవారం అన్నారం వైన్స్ నుంచి 4 మద్యం బాటిళ్ల కాటన్లను బైక్‌పై తీసుకెళ్తున్నాడు. లలితాపూర్ శివారులో ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలు చేపడుతూ అతన్ని పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

నువ్వు లేకుండా ఎలా బతికేది..?



గంగాధర్ గౌడ్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఉపాధివేటలో గల్ఫ్ బాట పట్టిన యువకుడి శవపేటికలో తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. 'నువ్వు లేకుండా ఎలా బతికేది..' అంటూ మృతుని భార్య రోదించిన తీరు అక్కడి వారిని కలచివేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని అనంతపల్లికి చెందిన బుర్ర గంగాధర్‌గౌడ్ (44) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లాడు. అక్కడ పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. బుధవారం పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో అతని స్నేహితులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందగా.. సోమవారం శవపేటిక స్వగ్రామానికి చేరింది. శవపేటికపై పడి భార్య లక్ష్మి, తల్లి గంగవ్వ రోదనలు మిన్నంటాయి. మృతునికి తండ్రి సత్తయ్య, తల్లి గంగవ్వ, భార్య లక్ష్మి, కుమారుడు మనివర్దన్, కూతురు మణిదీప్తి ఉన్నారు.

23న మాయావతి బహిరంగసభ



మాట్లాడుతున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించే బహిరంగ సభకు బీఎస్పీ చీఫ్ మాయావతి హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవునూరి సంపత్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే సభకు ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. నాయకులు బోయిని రంజిత్, తోట వెంకటేశ్, కాదసి రమేశ్, అరెపల్లి రాహుల్, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు(పెద్దపల్లి): జిల్లా కేంద్రంలో జరిగే బీఎస్పీ బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, కార్యవర్గసభ్యుడు కాంపెల్లి బాబు కోరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మా రం సతీశ్‌యాదవ్, భూషశారద, బాసంపల్లి నగేశ్, బొమ్మ ఓంప్రకాశ్, బొడ్డు విష్ణు, ఇరుగురాల సాగర్, మల్లేశ్, శ్రీనివాస్, నాగరాజుగౌడ్, సాగర్, లింగమూర్తి, రాహుల్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు!

- టీబీ కార్యాలయంలో మూలనపడ్డ నూతన ఎక్స్‌రే మిషన్
- మూడేళ్లవుతున్నా నో ఇన్‌స్టాలేషన్
- డిప్యూటేషన్‌పై టెక్నీషియన్
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని నూతన ఎక్స్‌రే యంత్రం


రిమ్స్‌లో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం బారులు తీరిన రోగులు


ఆదిలాబాద్‌లోని టీబీ కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: క్షయ(టీబీ) నిర్మూలన కోసం ప్రభుత్వాలు లక్షలు వెచ్చిస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కొంతమంది వైద్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎక్స్‌రే మిషన్‌ను టీబీ ఆస్పత్రికి పంపించింది. ఓ టెక్నీషియన్‌ను నియమించింది. ఇక్కడ ఉండి విధులు నిర్వర్తించాల్సిన ఆ ఉద్యోగి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో తన సొంత జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. దీంతో నూతన ఎక్స్‌రే మిషన్ ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోకపోవడం గమనార్హం. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దుస్థితి.

ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం..

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో టీబీ ఆస్పత్రి ఉంది. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం రోజుకు పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. గతంలో రిమ్స్‌లో ఈ పరీక్షలు చేస్తుండగా, రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మూడేళ్ల క్రితం టీబీ ఆస్పత్రికి సుమారు రూ.30 లక్షలు వెచ్చించి నూతనంగా ఎక్స్‌రే మిషన్ పంపించింది. అయితే అధికారుల అలసత్వం కారణంగా ఆ యంత్రం కాస్తా మూలనపడగా, రోగులు గతంలోలాగే రిమ్స్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి. ఇక్కడ యంత్రం ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని తెలుస్తోంది. జిల్లాలో వేతనం తీసుకుంటూ ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వైద్యారోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులందరి డిప్యూటేషన్లు రద్దయినప్పటికీ ఈయన మాత్రం హన్మకొండలోనే దర్జాగా విధులు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక్కడ రోగుల పరిస్థితి ఏమిటి..?

టీబీ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్‌గా పనిచేసే ఉద్యోగి ఉన్నతాధికారులతో పైరవీలు చేసుకొని ఏడాది కాలంగా హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్‌లో టీబీ కార్యాలయం నుంచి వేతనం తీసుకుంటున్న ఆయన ఇక్కడ లేకపోవడంతో ఆ యంత్రం పనిచేయకుండా పోతోంది. ఆ ఉద్యోగిని టీబీ కార్యాలయానికి కేటాయించడంతోనే ప్రభుత్వం లక్షల విలువైన యంత్రాన్ని మంజూరు చేసింది. తీరా ఆయన డిప్యూటేషన్‌పై ఆయన సొంత జిల్లాకు వెళ్లడంతో ఇక్కడి రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. రిమ్స్ ఆస్పత్రిలో టీబీ నిర్ధారణ కోసం రోజుకు 20 నుంచి 30 మంది వరకు వస్తున్నారు. వీరందరిని ఎక్స్‌రే తీయించేందుకు అధికారులు రిమ్స్‌కు పంపిస్తున్నారు. దీంతో అక్కడ రద్దీ పెరిగి రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.

రేడియోగ్రాఫర్ డిప్యూటేషన్‌పై ఉన్నారు

టీబీ కార్యాలయానికి కేటాయించిన రేడియోగ్రాఫర్ ఏడాదికి పైగా డిప్యూటేషన్‌పై ఉన్నారు. ప్రస్తుతం ఆయన హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నారు. టీబీ కార్యాలయానికి ప్రభుత్వం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ మంజూరు చేసింది. త్వరలోనే ఇన్‌స్టాలేషన్ చేయిస్తాం. ప్రస్తుతం రోగులను ఎక్స్‌రే కోసం రిమ్స్‌కు పంపిస్తున్నాం.

– సాయిప్రియ, టీబీ ప్రోగ్రాం అధికారి, ఆదిలాబాద్

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి


వేడుకల్లో పాల్గొన్న మార్వాడి సంఘు సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో రాధే రాధే ప్రభాత్‌భేరీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గోపాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మార్వాడి మహిళలు, పురుషులు రాధాకృష్ణ భవన్ నుంచి భజనలు, కీర్తనలతో గోశాలకు వెళ్లి అక్కడ కృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 56 రకాల నైవేద్యాలను గోవులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్నా లడ్డా, ప్రదీప్ లడ్డా, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్

నిర్మల్ రూరల్: క్రీడల్లో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి వుషూ, కిక్ బాక్సింగ్ సెలక్షన్స్‌లో లోకేశ్వరం, భైంసా, కుభీర్ కేజీబీవీల విద్యార్థులు, బాసరలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వారిని కలెక్టరేట్‌లో సోమవారం అభినందించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి నఫీఖాన్, జీసీడీవో శ్రీదేవి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు, ట్రైనర్లు సాయికిరణ్, జితేందర్‌సింగ్, పీఈటీలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య తోపులాట


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆయా పార్టీల నాయకులు రోడ్ షో నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌బాబు రోడ్‌షో మార్కెట్ ఏరియా నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి ముందుగా చేరుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప తనయుడు వంశీకృష్ణ రోడ్ షో అక్కడికి చేరుకుంది. ఇరుపార్టీల ప్రచార వాహనాల ఎదుట కార్యకర్తలు నృత్యం చేయడంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఒక దశలో ఇరువర్గాల మధ్యలో తోపులాట జరిగింది. సీఐ సాధిక్ పాషా, ఎస్సైలు మధుకర్, వెంకటేశ్, విక్రమ్ ఇరువర్గాలను శాంతిపజేసే ప్రయత్నం చేశారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నరని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం హరీశ్‌బాబు ప్రచార వాహనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఉద్రిక్తత చల్లారింది. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేష్ మాట్లాడుతూ ఫీజుల పేరుతో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫీజు చెల్లించకుంటే కళాశాలకు రావద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. అకారణంగా తొలగించిన లెక్చరర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టోంకిని ఆలయానికి పోటెత్తనున్న భక్తజనం

- కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు మహాపాదయాత్ర
- వేలాదిగా తరలిరానున్న ప్రజలు


శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం


ఆలయంలోని సిద్ధి హనుమాన్ విగ్రహం

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకినిలోని శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయానికి మంగళవారం భక్తజనం పోటెత్తనున్నారు. ఏటా కార్తీకమాసం రెండో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా టోంకిని హనుమాన్ ఆలయం వరకు భక్తులు మహాపాదయాత్ర నిర్వహిస్తారు.

భక్తుల అపార నమ్మకం..

ఆలయంలో సిద్ధి హనుమాన్‌ను దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల అపార నమ్మకం. దీంతో ఏటా కార్తీక మాసంలో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాల, బెజ్జూర్ మండలాలు, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర పట్టణాలైన వీరూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలతో పాటు గ్రామాల నుంచి వేలాది భక్తులు పాదయాత్రగా తరలివస్తారు.

భారీ బందోబస్తు...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సాదిక్ పాష, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సిర్పూర్(టి)–కాగజ్‌నగర్, సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారులతో పాటు ఆలయ సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్టు సభ్యుడు జాబోర్ మారుతి తెలిపారు.

త్యాగాలు ప్రజలవి..భోగాలు కేసీఆర్‌వి

- పదేళ్లలో అంతులేని అవినీతి
- ఇవి తెలంగాణ దశ..దిశ మార్చే ఎన్నికలు
- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి


సభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసింది ప్రజల వంతైంది.. స్వరాష్ట్రంలో భోగాలు కేసీఆర్‌కు దక్కాయని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్ల పద్మశాలి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సీపీఐ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు రాష్ట్ర దశ..దిశ మార్చేటివి అన్నారు. గతంలోని ప్రభుత్వాలు కట్టిన నాగార్జునసాగర్ తదితర ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కేసీఆర్ హయాంలో ఇటీవలే నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఇన్నాళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు లక్షలాది కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సీపీఐ నాయకులు సామల మల్లేశం, వెంకటస్వామి, పంతం రవి, కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణగౌడ్, ఎల్లె లక్ష్మినారాయణ, గోలి వెంకటరమణ, గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలైంది

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, తెచ్చుకున్న స్వరాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకుంటూ, దొరల నుంచి విముక్తి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

‘సన్న’ రైతులను బతికించాలని..

- సన్నరకం బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు
- గ్రామాల్లో బియ్యం ఉత్పత్తి సంఘాలతో రైతుకు ఆదాయం
- జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు


గతంలో మార్కెట్‌లోకి విడుదల చేసిన లక్ష్మీపూర్ రైస్

జగిత్యాల అగ్రికల్చర్: రైతులు ఐదారు నెలలు కష్టపడి, భోజనానికి ఉపయోగించే సన్నని వరి ధాన్యం పండించినప్పటికీ, మార్కెట్‌లో సరైన ధర రాక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులూ రాక, అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చి, విక్రయిస్తున్నారు. వినియోగదారులు ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తే అన్నదాతలకు కొంతలో కొంత ఉపశమనం కలుగుతుంది. ప్రస్తుతం మార్కెట్లో సన్న బియ్యం(క్వింటాల్‌కు).. బీపీటీ రకం రూ.3,800–రూ.4,000, జై శ్రీరాం రకం రూ.4,800–రూ.5,000, హెచ్‌ఎంటీ రకం రూ.4,000–రూ.4,200 వరకు ధరలు ఉన్నాయి.

జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో సాగు..

జగిత్యాల జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో బీపీటీ, హెచ్‌ఎంటీ, జై శ్రీరాం వంటి సన్న రకాల వరి ధాన్యం సాగు చేశారు. ఎకరానికి 18–20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 లక్షల క్వింటాళ్ల ధాన్యం పండింది. ప్రస్తుతం బీపీటీ రకానికి క్వింటాల్‌కు రూ.2,100–రూ.2,300, జై శ్రీరాం రకానికి రూ.2,500–రూ.2,800, హెచ్‌ఎంటీ రకానికి రూ.2,400–రూ.2,500 వరకు ఓపెన్ మార్కెట్‌లో రేటు పలుకుతోంది. ఇవి రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. అందుకే, చాలామంది ధాన్యాన్ని బియ్యంగా మారుస్తున్నారు.

బతికించాల్సింది వినియోగదారులే..

రైతులకు తమ పంట ఉత్పత్తులను కార్పొరేట్ కంపెనీలాగా ప్రచారం చేసుకొని, అమ్ముకునే స్థోమత లేదు. వారికి బతికించాల్సింది వినియోగదారులే. చాలా గ్రామాల్లో రైతులు సన్న వరి ధాన్యాన్ని మిల్లులో మర ఆడించి, నేరుగా వినియోగదారులకు అమ్ముతున్నారు. బియ్యాన్ని నేరుగా రైతుల వద్దే కొనుగోలు చేస్తే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అన్నదాతలకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. లేకపోతే బియ్యం నలుగురైదుగురు దళారుల చేతులు మారి, రేట్లు పెరుగుతాయి. ఇది వినియోగదారులకూ నష్టమే.

బియ్యం ఉత్పత్తి సంఘాలు ఏర్పడాలి

సన్న వరి ధాన్యం పండించిన రైతులు ఆయా గ్రామాల్లో బియ్యం ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడాలి. వాటి ద్వారా ధాన్యాన్ని మర ఆడించేందుకు ఓ రైస్‌మిల్లర్‌తో మాట్లాడుకొని, బియ్యాన్ని నేరుగా సంఘాల ద్వారా అమ్ముకోవాలి. నగరాల్లో అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో తమ బియ్యం నాణ్యత చూపించి, ఆర్డర్లు తీసుకుంటే హాట్ కేకుల్లా అమ్ముడుపోయే అవకాశం ఉంటుంది.

అశోక్‌కుమార్ స్ఫూర్తితో..

గతంలో జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ కన్సల్టెంట్‌గా పనిచేసిన దన్నపునేని అశోక్‌కుమార్ గ్రామాలు తిరుగుతూ, సన్న వరి ధాన్యం అమ్మే బదులు బియ్యంగా అమ్మితే ఆదాయం పెరుగుతుందని రైతుల్లో చైతన్యం కలిగించారు. దీంతో జగిత్యాల మండలంలోని లక్ష్మీపూర్, కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి, మేడిపల్లి మండలంలోని తొంబర్రావుపేట వంటి గ్రామాల్లో రైతులు సంఘాలుగా ఏర్పడ్డారు. ఆయా గ్రామాల పేరుతోనే బియ్యం విక్రయించడం ప్రారంభించారు. వీరిని చూసి, చాలా పల్లెల్లో రైతులు బియ్యాన్ని నేరుగా వినియోగదారులకే విక్రయిస్తున్నారు.

రైతులను కలవండి



వినియోగదారులు రైతులను కలిస్తే, బియ్యం పట్టించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. చాలా మంది అన్నదాతలు ఎవరైనా కొంటారో, కొనరోనని భావించి, ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు.

– గడ్డం సత్యనారాయణరెడ్డి, నాగారం, ధర్మపురి మండలం

నమ్మకంగా కొనుగోలు చేయండి




రైతులను బతికించడాన్ని వినియోగదారులు తమ బాధ్యతగా తీసుకోవాలి. బియ్యాన్ని నేరుగా వారివద్దే కొనుగోలు చేస్తే ఆ తృప్తి వేరేలా ఉంటుంది. నమ్మకమైన రైతు దగ్గర బియ్యం కొనుగోలు చేసి, చూడండి.

– అశోక్‌కుమార్, రిటైర్డ్ జిల్లా వ్యవసాయాధికారి

మోటార్లకు విశ్రాంతి

- 2019 జూలై 31న తొలి మోటారుకు వెట్‌రన్
- నాలుగేళ్ల వ్యవధిలోనే మేడిగడ్డలో అంతరాయం
- బ్యారేజ్ కుంగడంతో నీటిని ఖాళీ చేసిన అధికారులు


నిలిచిపోయిన ఎత్తిపోతలు


పంపుహౌస్‌లో బిగించిన భారీ మోటార్లు

రామగుండం: సముద్రంలో కలుస్తున్న వృథా నీటిని రివర్స్ పంపింగ్ పద్ధతిన సద్వినియోగం చేసుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేశారు. స్వల్ప వ్యవధిలోనే ప్రఖ్యాత ఇంజినీరింగ్ డిజైన్‌తో రూపుదిద్దుకున్న కాళేశ్వరం.. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా ప్రాచుర్యం పొందింది. నీటిని ఒడిసి పట్టుకునేందుకు గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాల్లో బ్యారేజీలు నిర్మించారు. ఎత్తిపోతల ద్వారా గోదావరి నదిపై ఎగువన నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. దీనిని కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1 కింద చేర్చారు. అయితే, నాలుగేళ్ల వ్యవధిలోనే పిల్లర్లు కుంగి రూ.కోట్లు నీటిపాలయ్యాయయని ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

బ్యారేజీ కుంగడంతో నిలిచిన ఎత్తిపోతలు..

మేడిగడ్డ లక్ష్మీబ్యారేజ్ బీ బ్లాక్ 18, 19, 20, 21 పిల్లర్ల మధ్య వంతెన ఒక అడుగు మేర కుంగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ కంపెనీ పునరుద్ధరణకు సిద్ధమైంది. తొలుత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని నీటిని దిగువకు వదలడంతో బ్యారేజీలు ఖాళీ అయ్యాయి. అయితే, పునరుద్ధరణ తర్వాత ఎత్తిపోతలకు ఎంతసమయం పడుతుందనే అంశంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. ఫలితంగా భారీ విద్యుత్ మోటార్లకు విశ్రాంతి లభించింది.

మెట్ట భూములను తడిపేందుకు..

భూ ఉపరితలంపై నీటి ప్రవాహం సాధారణమే అయినా.. మెట్ట(ఎత్తు పల్లంలో) ప్రాంతాల భూములను తడిపేందుకు ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకం వినియోగిస్తారు. ఫలితంగా అన్‌సీజన్‌లో సైతం ఆయకట్టుకు సరిపడా వరద నీటిని సమృద్ధిగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గోలివాడ (పార్వతీ) పంపుహౌస్ ప్రాధాన్యం..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో గోలివాడ (పార్వతీ) పంపుహౌస్ నిర్మించారు. 2018 డిసెంబర్ 16న అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ దీనిని ప్రారంభించారు. 18 నెలల వ్యవధిలోనే పనులు పూర్తిచేశారు. పంపుహౌస్ నిర్మాణం కోసం 380.36 ఎకరాలు సేకరించారు. పార్వతీ పంపుహౌస్‌లో 9 భారీ విద్యుత్ మోటార్లు బిగించారు. ఒక్కోదాని సామర్థ్యం 40 మెగావాట్లు కాగా 24 గంటల్లో ఒక్కో మోటారు 2,600 క్యూసెక్కులు ఎత్తిపోస్తుంది. అన్ని మోటార్లు నడిపితే 23,308 క్యూసెక్కుల నీరు పంపింగ్ అవుతుంది. తొలి మోటారు 2019 జూలై 31న రాత్రి వెట్‌రన్ నిర్వహించారు. దశలవారీగా అన్ని మోటార్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. పంపుహౌస్ నిర్మాణం కోసం రూ.1,700 కోట్లు వెచ్చించారని అధికారులు తెలిపారు.

నిరుత్సాహంలో మత్స్యకారులు..

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు నిలిచిపోవడంతో మత్స్యకారులు నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఎత్తిపోతలతో పంపుహౌస్ నుంచి ప్రాజెక్టు వరకు ఉన్న అప్రోచ్ కాలువ నిల్వ నీటిలోకి టన్నుల కొద్దీ మత్స్య సంపద వచ్చి చేరుతుంది. మత్స్యకారులు తెప్పల సాయంతో చేపలవేట కొనసాగించేవారు. వీరి నుంచి చేపల కొనుగోలుకు సుదూర ప్రాంతాల నుంచి హోల్‌సెల్ వ్యాపారులు పెద్దసంఖ్యలో తరలివచ్చేవారు. స్వచ్ఛమైన నీటిలోని తాజా చేపలకు డిమాండ్ అధికంగా ఉండేది. ఎత్తిపోతలు నిలిచిపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది.

పర్యాటకులకూ నిరాశే..

ఏటా డిసెంబర్‌లో ఎత్తిపోతలు ప్రారంభించేవారు. ఈసారి మేడిగడ్డ ఘటనతో ఎత్తిపోతల ఆగిపోయింది. ఎత్తిపోతలు ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు పునరుద్ధరించి లీకేజీలను పరిశీలించి బ్యారేజీలను నీటితో నింపాల్సి ఉంది. అప్పటివరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంపుహౌస్‌ల్లోని మోటార్లు మూగబోనున్నాయి. కాగా, చాలాకాలం వరకు మోటార్లను రన్ చేయకుంటే తుప్పు పట్టే ప్రమాదం ఉండడంతో డ్రైరన్ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలపై సంబంధిత శాఖ అధికారిని ‘సాక్షి’ సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

బీఎస్పీతోనే పేదల బతుకులు మారుతాయి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ధర్మపురి: బీఎస్పీ ద్వారానే పేదల బతుకులు మారుతాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ముందుగా వివేకానంద చౌరస్తా నుంచి పటేల్ విగ్రహం వరకు రోడ్‌షో చేపట్టారు. పార్టీ అధినేత మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణలో పోటీకి సిద్ధమయ్యామని తెలిపారు. బడ్జెట్‌లో బీసీల వాటా కోసం ప్రశ్నించేందుకు.. కులగణన ఎందుకు చేపట్టడం లేదో తెలియజేసేందుకే ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల మధ్యకు వచ్చానని వెల్లడించారు. తనకు ప్రజాబలమేనని పేద ప్రజల బలంతోనే ముందుకు వచ్చానని పేర్కొన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో దొరలపాలనకు మంగళం పాడాలని విజ్ఞప్తి చేశారు.

‘కేసీఆర్ అహంకారానికి నిదర్శనం’


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: దేశంలో సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేసిన ఇందిరా గాంధీపై సీఎం కేసీఆర్ విమర్శలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ‘ఇందిరమ్మ రాజ్యమా.. తోకమట్టానా..’ అని మాట్లాడడాన్ని ఖండించారు. ఓటమి భయంతో కేసీఆర్ విచక్షణ మరిచిపోయి మాట్లాడుతున్నారని తెలిపారు. భూసంస్కరణలు చేపట్టి పేదలకు మిగులు భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీదని గుర్తుచేశారు. కేసీఆర్ రాజకీయ ఓనమాలు నేర్చుకున్నది కాంగ్రెస్ పార్టీలోనే అన్న విషయం మరువరాదని సూచించారు. ఆయన వెంట గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, కల్లెపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, చందా రాధాకిషన్ తదితరులు ఉన్నారు.